క్లుప్తంగా

బీఆర్ఎస్ ఇంటింటి ప్రచారం

ఖమ్మంమయూరిసెంటర్/ఖమ్మం అర్బన్: నగరంలోని 10వ డివిజన్ ఇందిరానగర్, 20వ డివిజన్‌లో కార్పొరేటర్ బిక్కసాని ప్రశాంత లక్ష్మి ఆధ్వర్యాన మంత్రి పువ్వాడ సతీమణి వసంత లక్ష్మితో కలిసి బీఆర్ఎస్ అభ్యర్థి పువ్వాడ అజయ్‌కుమార్‌ను గెలిపించాలని కోరుతూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుడా డైరెక్టర్ కొల్లు పద్మ, నగర ప్రచార కార్యదర్శి షేక్ షకీనా, పార్టీ నగర యువజన విభాగం అధ్యక్షుడు దేవభక్తుని కిషోర్‌బాబు, డివిజన్ ప్రెసిడెంట్ మహమ్మద్ యాకూబ్ పాషా, మాజీ ఎంపీటీసీ వంగవీటి శ్రీనివాస్‌రావు, బీఆర్ఎస్ నగర నాయకుడు కోటేశ్వరరావు, మైనారిటీ నాయకులు, స్థానికులు మహమ్మద్ అతీఫ్, రహమాన్, ఎండీ షకీల్ పాషా, ఎండీ సాధిక్, గాజర్ల సతీష్, చారి తదితరులు పాల్గొన్నారు.

చీరలు అందజేత

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని యూపీహెచ్ కాలనీలో గల 400 కుటుంబాలకు చెందిన పేద మహిళలకు బీఆర్ఎస్ 4వ డివిజన్ అధ్యక్షుడు జోగుపర్తి ప్రభాకర్‌రావు దంపతులు ఆదివారం చీరలు పంపిణీ చేశారు. సద్దుల బతుకమ్మ, దసరా పండుగలను పురస్కరించుకొని చీరలను పంపిణీ చేసినట్లు ప్రభాకర్ తెలిపారు.

విద్యార్థినికి ల్యాప్‌ట్యాప్..



ల్యాప్‌ట్యాప్ అందిస్తున్న దాతలు

ఖమ్మం సహకారనగర్: హైదరాబాద్ సీఎంఆర్ ఇంజనీరింగ్ కాలేజీలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న మల్లెంపాటి సాయిశ్రీ అనే విద్యార్థినికి బిక్కసాని వెంకటరత్నం, పురుషోత్తం, పుతుంబాక కమలా ప్రసాదరావుల ఆర్థిక సహకారంతో ఆదివారం రూ.45 వేల విలువైన ల్యాప్‌ట్యాప్‌ను అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ వంతు సహకారంగా విద్యార్థినికి ల్యాప్‌టాప్ అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు యలమద్ది వెంకటేశ్వర్లు, సాదు లక్ష్మణరావు, కొంగర పురుషోత్తమరావు, మద్దినేని ప్రసాదరావు, ఎల్.సతీష్, రమణారావు, బిక్కసాని సురేష్, బిక్కసాని వనజ, కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా తనిఖీలు

నేలకొండపల్లి: మండలంలోని జిల్లా సరిహద్దు గ్రామమైన పైనంపల్లి వద్ద, నేలకొండపల్లి మండల కేంద్రంలో ప్రత్యేక చెక్ పోస్టులు ఏర్పాటు చేసి ముమ్మరంగా తనిఖీలు చేస్తున్నారు. ప్రతీ వాహనాన్ని ఫ్లయింగ్ స్క్వాడ్, రిటర్నింగ్ అధికారులు, పోలీసులు, ఎక్సైజ్ పోలీసులు అడుగడుగునా జల్లెడ పడుతున్నారు. తహసీల్దార్ ఎస్.శ్వేత, ఎంపీడీఓ కె.జమలారెడ్డి, ఎస్సై సతీశ్‌లు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు.

కందాళ పరామర్శ

నేలకొండపల్లి/తిరుమలాయపాలెం: నేలకొండపల్లి, తిరుమలాయపాలెం మండలాల్లో ఇటీవల మృతి చెందిన పలువురి కుటుంబాలను ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి పరామర్శించారు. తిరుమలాయపాలెం ఏనెకుంటతండాలో పలు పార్టీల నుంచి బీఆర్ఎస్‌లో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు.

బీఆర్ఎస్‌కు రాజీనామా

ఖమ్మంమయూరిసెంటర్: తెలంగాణ ఉద్యమకారులకు గుర్తింపు లేకపోవడంతోనే బీఆర్ఎస్ పార్టీ క్రియాశీలక సభ్యత్వానికి, విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పదవికి రాజీనామా చేస్తున్నట్లు బీఆర్ఎస్ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రడం సురేష్‌గౌడ్ తెలిపారు. ఆదివారం ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ విలేకరుల సమావేశంలో జిల్లా నాయకుడు కందగట్ల రాజేందర్, యువజన నాయకులు ఎస్‌కె.పాషా, కనకంపూడి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

పలువురి మద్దతు కోరిన మాజీ మంత్రి తుమ్మల

ఖమ్మంవన్‌టౌన్: నగరంలోని కమాన్‌బజార్‌లో వెంకటేశ్వరస్వామి గుడి చైర్మన్ తాడిశెట్టి వెంకటేశ్వరరావు, జిల్లా కిరాణ జాగీర్ మర్చంట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చిల్లంచర్ల రాధా, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు వీవీ అప్పారావుల ఇళ్లకు మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెళ్లి మర్యాదపూర్వకంగా కలిసి మద్దతు కోరారు. తుమ్మల వెంట మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, కమర్తపు మురళి, దుద్దుకూరి వెంకటేశ్వర్లు, చావా నారాయణరావు, జంగం భాస్కర్, పోట్ల వీరేందర్, తుపాకుల యలగొండల స్వామి, మాజీ కార్పొరేటర్ బాలగంగాధర తిలక్, తదితరులున్నారు.

ఆర్థిక సాయం..

రఘునాథపాలెం: మండలంలోని బూడిదంపాడు గ్రామంలో ఇటీవల మరణించిన గుంపుల లచ్చయ్య కుటుంబాన్ని పరామర్శించి వారికి కాంగ్రెస్ హెల్పింగ్ హాండ్స్ ద్వారా సేకరించిన రూ.9,016లను మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తనయుడు తుమ్మల యుగందర్ విరాళంగా అందించారు. ఈ కార్యక్రమాల్లో నాయకులు, అధ్యక్షులు దుద్దుకూరి వెంకటేశ్వర్లు, దిరిశాల చిన్న వెంకటేశ్వర్లు, తుమ్మలపల్లి నర్సింహారావు, తదితరులు పాల్గొన్నారు.

సద్దుల సంబరాలు..



బతుకమ్మ పేరుస్తున్న మహిళలు

బతుకమ్మ వేడుకల్లో భాగంగా చివరి రోజైన ఆదివారం రాత్రి నిర్వహించిన సద్దుల బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటాయి. ఈ సందర్భంగా మహిళలు, బాలికలు, యువతులు తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి భారీ ఊరేగింపుగా బతుకమ్మ ఘాట్ల వద్దకు చేరుకుని ఆడి, పాడి సందడి చేశారు. అనంతరం చెరువులు, వాగుల్లో బతుకమ్మలను వెళ్లి రావమ్మా బతుకమ్మ అంటూ నిమజ్జనం చేశారు. అలాగే వాయినాలు ఇచ్చిపుచ్చుకుని ఇళ్లకు పయనమయ్యారు.

– సాక్షి నెట్‌వర్క్





బతుకమ్మలకు పూజలు చేస్తున్న మహిళలు

ఖమ్మం: బ్యాంక్ కాలనీలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



కామేపల్లి: పండితాపురంలో కోలాటం ఆడుతున్న ఎమ్మెల్యే హరిప్రియానాయక్



ఖమ్మంరూరల్: బతుకమ్మలతో ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి కుటుంబసభ్యులు



రఘునాథపాలెం: చిమ్మపుడిలోని లక్ష్మీనర్సింహస్వామి ఆలయం వద్ద



కూసుమంచి: కోలాటం ఆడుతున్న పొంగులేటి శ్రీనివాసరెడ్డి సతీమణి మాధురి



ఖమ్మం: బతుకమ్మ వద్ద కోలాటం ఆడుతున్న మహిళలు



మున్నేరు వద్ద బతుకమ్మల చుట్టూ తిరుగుతూ ఆడిపాడుతున్న మహిళలు



మున్నేరు వద్దకు వచ్చిన వారికి మంచినీళ్లు అందిస్తున్న కార్పొరేటర్ ఎం.నాగేశ్వరరావు



నేలకొండపల్లి: చెరువుమాదారంలో బతుకమ్మ వద్ద పొంగులేటి ప్రసాదరెడ్డి

పొంగులేటి ప్రసాదరెడ్డి విస్తృత పర్యటన



కూసుమంచి: పెరికసింగారం సర్పంచ్‌ను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ప్రసాదరెడ్డి

కూసుమంచి/నేలకొండపల్లి/ఖమ్మంరూరల్: కూసుమంచి మండలంలోని పెరికసింగారం సర్పంచ్ వాసంశెట్టి వెంకటేశ్వర్లు, ఉప సర్పంచ్ కుంచాల ఉమారాణితో పాటు పలువురు వార్డు సభ్యులు జిల్లా కాంగ్రెస్ నాయకుడు పొంగులేటి ప్రసాదరెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఆదివారం గ్రామంలో నిర్వహించిన గడపగడపకు కాంగ్రెస్ కార్యక్రమంలో భాగంగా వీరు పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వార్డు సభ్యుల్లో దాసరి కోటయ్య, నిమ్మాని బ్రహ్మయ్య, దాసరి శంకర్, ఆజ్మీరా బాలాజీ, గుంగుల నాగమణి, గడ్డం నాగయ్య, మేడిశెట్టి వెంకన్న ఉన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు జూకూరి గోపాలరావు, రామసహాయం వెంకటరెడ్డి, ఎడవెల్లి ముతయ్యతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు. అలాగే నేలకొండపల్లి మండలం గువ్వలగూడెంలో మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి సతీమణి మాధురితో కలిసి ప్రచారం నిర్వహించారు. సర్పంచ్ వంగూరి వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ వంగూరి ఉష, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శాఖమూరి రమేష్, ఉప సర్పంచ్ కందుల వెంకటేశ్వర్లు, లిక్కి వీరబాబు, పాలడుగు అప్పారావు తదితరులు పాల్గొన్నారు. అలాగే ఖమ్మంరూరల్ మండలంలోని పలువురిని కలిసి పార్టీలోకి రావాలని కోరారు.

రక్తదాన శిబిరం విజయవంతం

నేలకొండపల్లి: మండలంలోని బైరవునిపల్లిలో బాబుజగ్జీవన్‌రావ్, అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరం విజయవంతమైంది. ఈ శిబిరాన్ని నేలకొండపల్లి ఎస్సై బి.సతీశ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తలసేమియా వ్యాధిగ్రస్తుల కోసం రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమని, ఇటువంటి సేవా కార్యక్రమాలు చేపడుతూ ఆదర్శంగా నిలవాలని సూచించారు. అనంతరం ఎస్సైను యూత్ సభ్యులు ఘనంగా సన్మానించారు. యూత్ సభ్యులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.


మంత్రిగా ఉన్నప్పుడు ఏం చేశారో చెప్పాలి...



సమావేశంలో మాట్లాడుతున్న నాగరాజు

ఖమ్మంమయూరిసెంటర్: మంత్రిగా ఉన్న సమయంలో తుమ్మల నాగేశ్వరరావు ఖమ్మం అభివృద్ధికి ఏం చేశారో చెప్పాలని పలువురు ప్రశ్నించారు. ఖమ్మంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, కార్పొరేటర్ కొత్తపల్లి నీరజ, బీఆర్ఎస్ లీగల్ సెల్ నాయకుడు సుగణారావు మాట్లాడుతూ.. నమస్కారానికి ప్రతి నమస్కారం చేసిన వారందరినీ తప్పుగా చిత్రీకరించడం సరికాదన్నారు. ఖమ్మంను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌ను మానసికంగా కుంగదీసేందుకు కాంగ్రెస్ నాయకులు యత్నిస్తున్నారని ఆరోపించారు. ఏదిఏమైనా ఖమ్మం ప్రజలు మరోసారి పువ్వాడ అజయ్‌కుమార్‌ను గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఈ సమావేశంలో కార్పొరేటర్ కూరాకుల వలరాజు, నాయకులు తాళ్లూరి జీవన్‌కుమార్, చిరుమామిళ్ల నాగేశ్వరరావు, సరిపుడి సతీష్, బత్తుల మురళీ, నాగుల్ మీరా, అంజిరెడ్డి, వల్లభనేని రామారావు, బిక్కసాని జస్వంత్, తొట్టి కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

కేసుల సంస్కృతి మీదే...



మాట్లాడుతున్న కార్పొరేటర్లు, నాయకులు

ఖమ్మంవన్‌టౌన్: ప్రశ్నిస్తే కేసులు పెట్టిన సంస్కృతి మీదేనని, భూకబ్జాలు చేసే వారిని వెంట పెట్టుకుని తిరుగుతున్నారని మంత్రి పువ్వాడపై కాంగ్రెస్ కార్పొరేటర్లు ధ్వజమెత్తారు. ఆదివారం నగరంలోని తుమ్మల క్యాంపు ఆఫీస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కార్పొరేటర్లు మిక్కిలినేని మంజుల, ముస్తఫా రఫీదాబేగం, దుద్దుకూరి వెంకటేశ్వర్లు, నాయకులు చావా నారాయణరావు, రావూరి సైదుబాబు, కొప్పెర ఉపేందర్, పోట్ల వీరేందర్‌లు మాట్లాడారు. మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు జిల్లాను అభివృద్ధి పథంలో నడిపారని, ఆయన హయాంలో ఎన్నడూ ప్రజలు కేసులతో ఇబ్బందులు పడలేదని పేర్కొన్నారు. తుమ్మలపై అవాకులు చవాకులు పేలుస్తున్న కార్పొరేటర్లలో సగం మందికి పైగా రాజకీయ జీవితాన్ని ప్రసాదించింది తుమ్మలేనని, తుమ్మలను విమర్శించే స్థాయి మీరు లేదన్నారు. తుమ్మలను అత్యంత మెజార్టీతో గెలిపించుకోవాల్సిన అవసరం ఖమ్మం నగర ప్రజలపై ఉందన్నారు.

అమ్మవారికి పూజలు, అన్నదానాలు



నవదుర్గా అలంకరణలో వాసవీ ఆలయంలోని అమ్మవారు

శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆదివారం అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమివ్వగా.. అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి మండపాలు, ఆలయాల వద్ద ఉత్సవ కమిటీ ఆధ్వర్యాన అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. – సాక్షి నెట్‌వర్క్